# జడ్జిమెంట్

చెక్‌పోస్ట్ తనిఖీ పూర్తి చేయించుకుని బయలు దేర బోతున్న లారీని ఒక్క అంగలో చేరుకున్నాడు భానుమూర్తి.

తన అవసరం లారీ డ్రైవర్‌కి చెప్పేడు ... ప్రాధేయ పడ్డాడు.

భానుమూర్తి అభ్యర్థనను కాదన్లేక పోయాడు లారీ డ్రైవరు.

కేబిన్లోకి ఎక్కి కూర్చున్నాడు భానుమూర్తి.

నిండు చూలాలి నడకతో కదిలింది లారీ!

చల్లనిగాలి భానుమూర్తి ముఖానికి సోకటంతో అప్పటివరకు ఎంతో దూరం తిరిగి రావటంవల్ల చమటపట్టిన శరీరానికి కొంత ఉపశమనం కల్గినట్టన్పించింది.

కర్చీఫ్‌తో ముఖం తుడుచుకుని సిగరెట్ వెలిగించేడు భానుమూర్తి.

లారీ వేగాన్ని పుంజుకుంది.

భానుమూర్తిలో ఆందోళన ... ఆలోచన లారీ వేగంతో పోటీపడు తున్నయ్.

శారద కెలా వుందో ...?

మామగారిచ్చిన టెలిగ్రాం భానుమూర్తిని కలవర పెట్టింది.

స్టేషను కెడితే రైలు తప్పి పోయింది.

బస్టాండు కెళ్ళేడు.

నైటెక్సుప్రెస్‌లో ఓవర్‌లోడ్ తీసుకోనన్నాడు కండక్టర్.

మరో మార్గంలేక ... ఎలాగైనా రాత్రికి రాత్రి శారద దగ్గరకు రెక్కలు కట్టుకుని వెళ్ళి వాలాలనే ఆదుర్దాతో వూరి చివర చెక్‌పోస్ట్ దగ్గరకొచ్చి లారీలో ప్రయాణం చేయాల్సి రావటం తప్పని సరైంది.

"డ్రైవర్! — మనం కావలి చేరుకునే సరికి ఎన్ని గంటలవుతుంది ..." అడిగేడు.

"పోలీసువారి సోదాలు ... చెక్‌పోస్ట్ తనిఖీలు ... రైల్వే గేట్లు తప్పించుకుంటూ వెళ్ళేసరికి అర్ధరాత్రి దాటు

తుంతి సార్ ..." తల పక్కకైనా తిప్పకుండా చెప్పేడు డ్రైవరు.

లారీలో ప్రయాణం చేయటమంటే చచ్చేటంత భయం భానుమూర్తికి. - కానీ ... మరో గత్యంతరం లేక పోవటంతో సాహసించేడు. అవతల తన అవసరం అలాంటిది.

లారీ డ్రైవర్లు ఓవర్ స్పీడు పోతారనీ ... పీకలదాకా తాగి డ్రైవ్ చేస్తారనీ ... అనేకమైన లారీ యాక్సిడెంట్లకి డ్రైవర్ల నిర్లక్ష్యమే ముఖ్యకారణమనీ ... చాలాసార్లు పేపర్లో చదివేడు భానుమూర్తి.

ఆ విషయం మనస్సులోకి జొరబడగానే భానుమూర్తి శరీరం కంపించింది. గుండె దడ పెరిగినట్టయింది.

వెంటనే డ్రైవరు ముఖంలోకి చూచేడు ...

కీచు మంటు లారీ ఆగింది.

హెడ్ లైట్స్‌తో పాటు ఇంజనూ ఆపుచేశాడు. కేబిన్లో సన్నటి లైటు వెలిగింది.

"గేటువేశారు సార్! - గూడ్సుబండే వస్తుందో ఎక్స్‌ప్రెస్సే వస్తోందో ... రాజమండ్రిలో బండి బయల్దేరితే మంగళగిరిలో గేటువేసి కూర్చుంటారు ..." బీడి ముట్టిస్తూ అసహనంగా అన్నాడు లారీ డ్రైవరు.

అతని జోక్‌కి నవ్వొచ్చింది.

"నీపేరేమిటి ... " అడిగేడు భానుమూర్తి.

"జోగులు ! – " అనేసి వెంటనే కేబిన్లోంచి క్రిందికి దిగేడు.

మరో అయిదు నిముషాలకు తిరిగొచ్చిన జోగులు స్టీరింగ్ ముందు కూర్చుంటూ "మరో అరగంటకు గానీ బండిరాదట ! ఓ రూపాయి పారేస్తాను గేటు తెరవమన్నాను. ససేమిరా వప్పుకోలేదు. గేట్ మెన్ ..." విసుగ్గా చెప్పేడు.

బస్సులు ... లారీలు ... ఇతరవాహనాలు గేటుకిరువైపులా బారులు తీరి నిలబడివున్నాయి.

స్వర్గ ద్వారాలు తెరుచుకున్నట్టు ఓఅరగంట అయ్యేక రైల్వే గేటు పైకి లేచింది.

ఎవరిమటుక్కు వాళ్ళకి తొందరే !.

రెండు వైపులా వున్న వాహనాలు రైల్వే ట్రాక్ మీాదికి జొరబడి వచ్చి నిల్చాయి.

ముందుకు సాగి పోయేటందుకు ఎవ్వరికీ దారిలేకుండా డెడ్లాక్ అయింది.

చెవులు చిల్లులు పడేలా హారన్ మోతలు ... కేకలు ... అరుపులు ... వాదులాటలు ...

ఎదురు లారీలో ప్రయాణం చేస్తున్న పోలీసు కానిస్టేబిలు దిగొచ్చి ఇరుపక్షాల వారికీ నచ్చచెప్పేడు.

గేరుమార్చి ముందుకు సాగేడు జోగులు.

'హమ్మయ్య' అనుకున్నాడు భానుమూర్తి ఓ పెద్ద గండం గడిచినట్టు.

నేషనల్ హైవేరోడ్డు అయినప్పటికీ దారి గతుకులుగా కుష్టురోగి శరీరంలా వుంది.

రోడ్డుకి రెండు వైపులా కుప్పలు పోసివున్న కంకర రాళ్ళగుట్టలు. దారికి అడ్డుగా వున్నాయ్.

భానుమూర్తి దృష్టి రోడ్డుకేసివున్నా ... ఆలోచన మరెటో వుంది.

పెళ్ళయిన పదేళ్ళకు మొదటి సారిగా తండ్రి కాబో తున్నందుకు మురిసి పోయాడు. శారదను పురిటికి పుట్టింటికి పంపేడు.

శారదకి సరిగ్గా పురుడొచ్చే రోజులే ...

ఇంతలో ఈ టెలిగ్రాం ఏమిటీ? —

శారదకి ఏమై వుంటుందీ? — కాన్పు కష్టమైందా ... ఒక వేళ పుట్టిన బిడ్డ...?

భగవాన్ శారదకి ఎలాంటి ఆపదా రాకుండా చూడు ... మనసులోనే వేయి దేవుళ్ళకి మొక్కేడు.

మరో ఎనభై కిలో మీటర్లు పోయాక మళ్ళీ ఆగింది లారీ!

ఆగిన లారీలోంచి దిగిన జోగులు రోడ్డు పక్కన చింత చెట్టు క్రిందుగా వున్న పాకలో కెళ్ళి వచ్చాడు.

జోగులు స్టీరింగ్ ముందు కూర్చోగానే సారావాసన గుప్పుమంది. కర్చీఫ్‌తో ముక్కు మూసుకున్నాడు. భాను మూర్తి.

"ఏం సార్ ... మీాకీ వాసన గిట్టదా ..." సెల్ఫ కొడుతూ అడిగేడు జోగులు.

"తాగక పోతే లారీ తోల లేవా — తాగి నడపటం ప్రమాదం కదూ — "

జిహ్వాకోరుచి ... పుర్రెకో బుద్ధి సార్ ! — నిద్ర అనేది మర్చిపోయి నెలకి ఇరవై రోజులు బండి తోలాలి. లేకపోతే ఓనరు వూరుకోడు. కష్టం మర్చిపోయి డ్యూటీ చేయాలంటే ఇది తప్పదు సార్ ..." రోడ్డుకేసి నిశ్చలంగా చూస్తూ జవాబిచ్చేడు జోగులు.

తాగివున్నా స్టడీగానే డ్రైవ్ చేస్తున్నందుకు ఆశ్చర్య పోయాడు భానుమూర్తి.

మిణుగురు పురుగులు ... ఇతరమైన చిన్నసైజు కీటకాలు ... గాలికి ఎగిరొచ్చి లారీ ముందున్న అద్దానికి గుద్దుకొని తునాతునకలై పోతున్నాయ్.

వాచీ చూచుకున్నాడు భానుమూర్తి.

మనిషిలో ఆకలి మొదలైంది.

ప్రయాణం తొందర్లో తాను భోజనం సంగతే పట్టించు కోలేదు:

"ఏం సార్ ... ఆకలిగా వుందా ... మరి కాస్సే పట్లో మేదరమెట్ల చేరుకుంటాం. అక్కడ తిందాం! — మల్లమ్మహోటల్లో కోడిపలావ్ మాంచిరుచిగావుంటుంది..." ఆరిపోయిన బీడిని దూరంగా విసిరేస్తూ చెప్పేడు జోగులు.

ఓ అరగంట ప్రయాణం తర్వాత ఓ చిన్నసైజు హోటలు ముందు లారీ నిలిపేడు జోగులు.

ఆకలిగా వున్నా ... కడుపులో మంటని మించి వున్నయ్ భానుమూర్తి మనసులో ఆలోచన్లు.

విస్తరిముందు కూర్చుని లేచాడు. అంతే! భోజనం అయిందనిపించు కున్నాడు.

పక్కనే వున్న కిల్లీకొట్లో రెండు అరటిపండ్లు కొని తినేసివచ్చి లారీలో కూర్చుని జోగులు రాకకోసం నిరీక్షిస్తు న్నాడు భానుమూర్తి.

బ్రేవ్ మని త్రేన్చుకుంటూ వచ్చి స్టీరింగు ముందు కూర్చున్నాడు జోగులు.

భుక్తాయాసంతో నడక సాగించింది లారీ!

మందులో వున్నాడు. అందునా పలావు పట్టించాడేమో ... రానురాను లారీ వేగం శృతిమించుతోంది.

ఎదురొచ్చే వాహనాలను అతి సునాయాసంగా తప్పి కుంటూ ... బహు చాకచక్యంతో డ్రైవ్ చేస్తున్న జోగులు కేసి వింతగా చూశాడు భానుమూర్తి.

అంత స్పీడులో ఎక్కడ యాక్సిడెంట్ జరుగుతుందోనే భయం భానుమూర్తిని పీక్కుతింటోంది.

"అయిన ఆలస్యం ఎట్లాగూ అయింది. కాస్త నెమ్మదిగానే పోదాం ..." అనకుండా వుండలేక పోయాడు భానుమూర్తి.

ఈదురుగాలి మొదలైంది.

ఆకాశం మబ్బులు కమ్ముతోంది.

మరో పదినిమిషాలైనా గడవకముందే... వురుములు మెరుపులతో వర్షం కుండపోతగా కురవటం ప్రారంభమైంది.

తీవ్రమైన పెనుగాలి తాకిడికి భూతాల్లా రోడ్డుకి రెండు వైపులావున్న చింతచెట్లు బరువుగా తలలు ఆడిస్తున్నయ్.

లారీ స్పీడు తగ్గింది.

చింతనిప్పుల్లా వున్న కళ్ళను మరింత పెద్దవిచేస్తూ రోడ్డుని శ్రద్ధగా పరికిస్తూ డ్రైవ్ చేస్తున్నాడు జోగులు.

కీచుమని శబ్దం చేస్తూ నాగుబాములా మెలికలు తిరుగుతూ రోడ్డుప్రక్కగా ఆగింది లారీ.

పరిస్థితి బోధపడ్డేదు భానుమూర్తికి.

జోగులు విసుక్కుంటూ "టైర్ పన్చరైందిసార్ ..." అన్నాడు అసహనంగ.

దరిద్రుని పెళ్ళికి వడిగళ్ళవానలా ... ఇవేం అవాంతరాలు భగవాన్ ... అనేసి వాపోయాడు భానుమూర్తి.

ఇంకోసారెప్పుడూ లారీలో ప్రయాణం చేయకూడదని తీర్మానించుకున్నాడు.

దబాటు వానతగ్గింది. అయినాసన్నగా తుంపర పడ్తూనే వుంది.

క్లీనరు వెధవకూడా లేడు. అన్నిటికీ నేనొక్కడినే చావాలి. పై నుంచి స్పేర్ టైర్ దించటం నా వక్కడి వల్లా అయ్యేపనికాదు - చుట్టుపక్కల మనిషి సాయం దొరుకుతుందేమో చూసొస్తాను మీరు బండిలోనే కూర్చోండి సార్ ..." అనేసి లారీ దిగిన జోగులు చీకట్లో అదృశ్యమైనాడు.

మనిషి సహాయం దొరక్కపోతే ... తాను తెల్లవార్లూ ... ఇక్కడే ... చీకట్లో కాలక్షేపం చేయాల్సిందేనాని వాపోయాడు భానుమూర్తి.

అడుగడుగునా అడ్డంకులే! - అన్నీ అవాంతరాలే ... తిట్టుకున్నాడు.

వర్షపు చినుకు పూర్తిగా తగ్గింది.

అయినా ఆకాశం మెరుస్తూనే వుంది.

చీకటి ... కప్పల అరుపులు ... కీచురాళ్ళ రొద .. వాతావరణం భయంకరంగా వుంది.

చలి మొదలైంది.

ఈదురుగాలి ఈ చెవిలోంచి ఆ చెవిలోకి కొడుతోంది.

లారీలో తానొక్కడే ... ...

పావు గంట దాటుతున్నా జోగులింకారాలేదేమా అనుకున్నాడు.

కూర్చున్న భానుమూర్తి దిగి సిగరెట్ వెలిగించాడు.

కన్ను పొడుచుకున్నా కన్పించనంత చిమ్మ చీకటి... కాటుకలాంటి కటిక చీకటి!! ...

కొంత దూరంలో మనుష్యుల అలికిడి ... మెరుపు వెలుగులో కొన్ని గుడిశలూ అవుపించాయి.

జోగులు ఇంకా ఎందుకు రానట్టు? ... అక్కడ మనుష్యుల అలజడీ ... అస్పష్టంగా విన్పించే ఆ కేకలూ ఏమిటీ? ... అనుకుంటూ చీకట్లోనే తానూ నడుచుకుంటూ అక్కడికి చేరుకున్నాడు.

ఓ గుడిశముందున్న ఆడమనిషి నానా మాటలూ అంటోంది.

జోగులు వీరంగం వేస్తున్నాడు. తిడుతున్నాడు.

పక్క గుడిశల్లో మనుష్యులు ఎవ్వరూ జోక్యం చేసు కోవటం లేదు. చోద్యం చూస్తూ నిల్చున్నారు.

అంతా అయోమయంగా తోచింది భానుమూర్తికి:

"పావలా ముండవి నీకెంత పొగరే ..." తిడుతూ గుడిశముందు నిల్చున్న ఆడమనిషి చెయ్యి పట్టుకున్నాడు జోగులు.

రాక్షసంగా జోగులు ఆడమనిషి మీదికి వంటికాలి మీద పోతున్నాడు.

ఎంతైనా ఆమె ఆడది ! - అందులోనూ వంటరిదిలా వుంది. ఇరుగూ పొరుగూ ఎవ్వరూ ఆమెను ఆదుకునే ప్రయ త్నం చేయుటం లేదు.

భానుమూర్తిలో ఆశ్చర్యంతో పాటు కోపమూ అసహ్యమూ చోటు చేసుకుంది.

జోగులు ఆమెతో పెనుగులాడుతూనే వున్నాడు. తిడ్తూనే వున్నాడు.

ఆమె ఎలాంటిదైనా ... ఇప్పుడామె వంటరిది.

జోగులుని ఎదుర్కొనే శక్తి తన్లోవుందా అన్పించింది భానుమూర్తికి.

తెలీని ఆవేశం ప్రవేశించింది భానుమూర్తిలో.

ఆమెను గుడిశలోకి లాక్కెళ్ళేడు జోగులు బల వంతంగ.

కొండచిలువలా ఆమెను పెనవేసు కోవాలని తీవ్ర ప్రయత్నం చేస్తున్నాడు.

ఆమె అశక్తత ...

జోగులు రాక్షసత్వం ...

ఆమె ... జోగులు ...

జోగులు ... ఆమె ...

భానుమూర్తి పూనకం వచ్చిన వాడిలా కోపంతో వూగిపోతున్నాడు.

తానూ గుడిశలోకి జొరబడ్డాడు.

ఆమెరోదన భానుమూర్తిని సంపూర్ణంగా కదిలించింది.

తడిక తలుపు పక్కగా వున్న కొడవలి చేతిలోకి తీసుకున్నాడు భానుమూర్తి.

అదను చూచి బలంగా కొట్టేడు.

గా (చా) వు కేక పెట్టి నేలకొరిగింది జోగులుకాదు - ఆమె !.

నెత్తుటిమడుగులో ఆమె గిలగిలా కొట్టుకుంటోంది, ఆమె ... ?

జోగులు పారిపోయాడు.

అనుకోని పరిస్థితికీ ... వూహించిని విధంగా ఆమెకి ప్రాణాపాయం సంభవించినందుకూ భానుమూర్తి నిర్విణ్ణు డయ్యాడు.

ఇప్పుడు తన పరిస్థితులేమిటి? -

పుణ్యానికి పోతే తనకు పాపం ఎదురైంది.

ఆమెని రక్షిద్దామనే వుద్దేశ్యంతో చివరికి ఆమె ప్రాణాలకే ముప్పు తెచ్చిన వాడయ్యాడు.

భానుమూర్తిలో భయం ... వణుకు ... దడ ప్రవేశించాయి.

మనిషి కుప్పకూలి పోయాడు.

* * * *

కోర్టు హాలంతా జనంతో క్రిక్కిరిసివుంది.

మరో క్షణంలో తీర్పు చెప్పటం జరుగుతుంది.

బోనులోవున్న ముద్దాయి భానుమూర్తిలో జీవం కన్పించటం లేదు.

జడ్జీగారు గొంతు సవరించుకుని "ముద్దాయి భానుమూర్తి ఒక స్త్రీని బలాత్కరింపబోయాడనీ ... ఎదురు తిరిగిన ఆమెను దారుణంగా హత్య చేశాడనీ ప్రాసిక్యూషన్ అభియోగం మోపింది — అందుకు వివిధ సాక్షులను ప్రవేశ పెట్టి క్రాస్ ఎగ్జామిన్ చేయటం జరిగింది. — అయితే

ముద్దాయి భానుమూర్తి ఆ నేరం తాను చేయలేదనీ ... జోగులు అనబడే లారీ డ్రైవరు ఆమెను బలాత్కరించ బోగా ... ముద్దాయి భానుమూర్తి ఆమెను రక్షించాలనే సదుద్దేశ్యంతోనూ ... జోగులు చర్యని అరికట్టాలనే అభిప్రాయంతోనూ ... మరో మార్గం కన్పించక కొడవలితో జోగులుని ఎదుర్కో బోగా గురితప్పి ఆ దెబ్బ మరణించిన స్త్రీకి తగిలిందనే నిజాన్ని కోర్టులో నిరూపించుకో లేక పోయాడు. — ముద్దాయి భానుమూర్తి డిఫెన్సుకి తగిన సాక్ష్యాధారాలను గానీ ... జోగులనే డ్రైవరును గానీ ... కనీసం ముద్దాయి ప్రయాణం చేశాడని చెప్పిన లారీ నెంబరు గానీ చెప్పలేక పోయిన కారణంగా ... కోర్టువారు ముద్దాయి భానుమూర్తే ఈ కేసులో నిందితుడనే విషయం రూఢిచేసినందున ... ముద్దాయి భానుమూర్తికి పది సంవత్సరాలు కఠిన కారాగార శిక్ష విధించడమైనది." తీర్పిచ్చేరు.

కోర్టుకి చెవులేగానీ కళ్ళు లేవనే నిజం భానుమూర్తి కేసు విషయంలో మరోసారి ఋజువైంది.

[28—4—79 ఆకాశవాణి కడప కేంద్రంనుండి ప్రసారితమైంది]